ప్రజాజ్యోతి
కామారెడ్డి
నిజామాబాద్
ఆదివారం | 23 | ఫిబ్రవరి | 2025 | పేజీలు: 5

## జక్రాన్పల్లిలో పోలింగ్ కేంద్రాలను

# పరిశీలించిన కలెక్టర్




### జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల ఆకస్మిక తనిఖీ

**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:** నిజామాబాద్, ఫిబ్రవరి 22 : నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలతో కూడిన శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం జక్రాన్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ ..మిగతా 2లో



## రంప పితూరీ ధీరుడు

## ద్వారబంధాల

# చంద్రయ్య దొర!

**ఫిబ్రవరి 23- 134వ వర్ధంతి**

**గుమ్మడి లక్ష్మీనారాయణ, ఆదివాసీ రచయితల వేదిక**

**రామారెడ్డి ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి)** విశాఖ మన్యంలో 1922లో అల్లూరి సీతారామరాజు సాగించిన స్వాతంత్ర్య పోరాటం చరిత్రాత్మకం. ఆదివాసీలు నివసించే గోదావరి పరీవాహక ప్రాంతంలో ఇంకొందరు ఆదిమ జాతి వీరులు సాగించిన పోరాటాలు మాత్రం వెలుగులోకి రాలేదు. 75 వసంతాల స్వాతంత్య అమృతోత్సవాల సందర్భంగా ఆ విస్మృత వీరులను మననం చేసుకునే తరుణమిది. ఆకోవలో ద్వారబంధాల చంద్రయ్య దొర తూర్పుగోదావరి జిల్లాలో తొలి స్వాతంత్ర్య సమరయోధుడు. అల్లూరి సీతారామరాజు మన్యం పోరాట కాలం (మన్యం పితూరి - 1922-24) కంటే 42 ఏళ్లముందే 'రంప పితూరీ' నడిపిన వీరుడుగా చంద్రయ్య దొరను గుర్తించకపోవడం చారిత్రక తప్పిదం. ఆ వీరుడు నేలకొరిగి 134 ఏళ్లు దాటింది. ఆయన ఆనవాళ్లను పరిశోధించి తొలిసారిగా చంద్రయ్య దొర జీవిత చరిత్రను లిఖించిన కోటిపల్లి సుబ్బారావు అభినంద నీయుడు. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం మన్యంలోని బురదకోటను స్థావరంగా చేసుకొని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా 1879లో చంద్రయ్య దొర తిరుగుబావుటా ఎగరేశాడు. ఆయనతో పాటు కారం తమ్మన్నదొర, పులిచింత సాంబయ్య, అంబుల్ రెడ్డి నాయకత్వంలో సామ్రాజ్యవాదుల దోపిడిని ప్రతిఘటించారు. ప్రజా ప్రతిఘటనలో భాగంగా మన్యం రైతులు ముఠాదారులు, అధికార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఈ తిరుగుబాటు ఉధృత రూపం దాల్చింది. రంపచోడవరంలో ప్రారంభమయిన రంప పితూరీ 'భద్రాచలం, రేకపల్లి, కొయ్యూరు, ..మిగతా 4లో



2

## సంస్కృతి, సంప్రదాయాలు

# దేశ ఔన్నత్యాన్ని చాటించాలి

## 'ఆపద మిత్ర' వాలంటీర్లకు ముగిసిన

# మొదటి విడత శిక్షణ



**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:** నిజామాబాద్, ఫిబ్రవరి 22 : విపత్తులు సంభవించిన సమయాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా ఆపద మిత్ర వాలంటీర్లకు అందిస్తున్న మొదటి విడత శిక్షణ శనివారం ముగిసింది. 300 మంది వాలంటీర్లను మూడు బ్యాచ్ లుగా విభజించి 19 రోజుల పాటు వివిధ శాఖల నిపుణులు, స్వచ్ఛంధ సంస్థల ద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాటిని ఎలా ..మిగతా 2లో



ఆరోగ్యం, పరిసరాల

## పరిశుభ్రతపై అవగాహన సదస్సు

ప్రజా జ్యోతి ప్రతినిధి: ఫిబ్రవరి,22, కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల అధ్యక్షురాళ్ళకు, గ్రామ సంఘం ఆరోగ్య కమిటీ మెంబర్ లకు మరియు వివో ఏ లకు ఆహారం, పౌష్టికాహారం, ఆరోగ్యం, రక్త హీనత, గర్భిణీ లు, బాలింతలు, మరియు పిల్లల పోషణ, వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసలరాల పరిశుభ్రత మొదలగు అంశాల పైన శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం రవీందర్ మండల సమాఖ్య అధ్యక్షురాలు, అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు, ఆరోగ్య కమిటీ సభ్యులు, వివో ఏ లు, సీసీ లు మరియు తదితరులు పాల్గొన్నట్లు ఏపీఎం తెలిపారు.



## తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యం

**తాడ్వాయి ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి** తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ గ్రామంలో తల్లి ఇద్దరు పిల్లలు అదృశ్యమైనట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం .. ఎర్ర పహాడ్ గ్రామానికి చెందిన చెవిటి రేవతి (24) భర్తతో సంసార విషయంలో నిత్యం గొడవలు జరుగుతూ ఉండేవని తెలిపారు. శు క్రవారం భర్త రంజిత్ గొర్రెలు మేపడానికి వెళ్లగా తిరిగి సాయంత్రం వచ్చేసరికి భార్య రేవతి ఇద్దరు పిల్లలు రిత్విక్ (5), రియాన్సీ(3) ఇంటి వద్ద కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారిని బంధువులను ఆరా తీసిన ఆచూకీ లభించకపోవడంతో భర్త రంజిత్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు అని తెలిపారు. మిస్సింగ్ కేసు గా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు గురుకుల ప్రవేశ పరీక్ష



**ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి)** ఉమ్మడి గురుకులాల ప్రవేశనికి 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు నేడు పరీక్ష నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరావు శనివారం ఒక ప్రకటనలు తెలిపారు. పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు హాల్ టికెట్,పరీక్ష ప్యాడ్,బ్లూ లేదా బ్లాక్ పెన్నులను తీసుకొని రావాలని సూచించారు. హాల్ టికెట్లలో ఏమైనా తప్పిదాలు ఉన్నట్లయితే విద్యార్థులు చదువుతున్న పాఠశాల నుండి బోనఫైడ్ సర్టిఫికెట్ లేదా ఆధార్ కార్డులను పరీక్ష కేంద్రానికి తీసుకొని వచ్చి ఇన్విజిలేటర్లకి చూపించాలని పేర్కొన్నారు.

# జక్రాన్పల్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్





**మొదటి పేజీ తరువాయి...**

స్టేషన్లలో అందుబాటులో ఉన్న వసతులను తనిఖీ చేశారు. ర్యాంప్, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, నీటి వసతి ఇత్యాది సదుపాయాలను పరిశీలించారు. ఈ నెల 27న పోలింగ్ ప్రక్రియ కొనసాగనున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో సాఫీగా పోలింగ్ జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు వేర్వేరుగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా, వాటి క్రమసంఖ్య, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. పాఠశాలలోని కిచెన్, తరగతి గదులను తనిఖీ చేశారు. అంతకుముందు కలెక్టర్ ఆర్మూర్ మండలం మునిపల్లి లోని మహాత్మా జ్యోతిబాపూలే మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూం లను పరిశీలించి సదుపాయాలను గమనించారు. బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యత, సరుకుల స్టాక్ ను పరిశీలించారు. కాగా, బియ్యం బస్తాలకు ట్యాగ్ లేకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్, ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా కేటాయించబడే ప్రతి రైస్ బ్యాగ్ కు తప్పనిసరిగా ట్యాగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లైస్ డీ.ఎం ను ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యాలయాలకు నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేసేలా పర్యవేక్షణ జరపాలన్నారు. న్యూ డైట్ మెనూ పట్టికను పరిశీలించి, విద్యార్థినులకు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# 'ఆపద మిత్ర' వాలంటీర్లకు ముగిసిన మొదటి విడత శిక్షణ



**మొదటి పేజీ తరువాయి...**

ఎదుర్కోవాలనే అంశాలపై ప్రయోగాత్మక శిక్షణ అందించారు. మూడు బ్యాచ్ ల వాలంటీర్లు మొదటి దఫా శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని న్యాక్ భవనంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి వాలంటీర్లను అభినందించారు. మరో రెండు దఫాలుగా వీరికి శిక్షణ అందించి, సుశిక్షితులైన సైనికుల వలే తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. తొలి విడత శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆపదమిత్ర వాలంటీర్లకు త్వరలోనే గుర్తింపు కార్డు, సర్టిఫికెట్ లను అందజేస్తామని అన్నారు. మిగితా రెండు దఫాల శిక్షణ కూడా పూర్తి చేసుకున్న వారికి ఐదు లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తింపజేస్తారని, సుమారు 10వేల రూపాయల విలువ చేసే విపత్తు నివారణ సహాయ ఉపకరణాలతో కూడిన కిట్ అందజేస్తారని తెలిపారు. విపత్తులు సంభవించిన సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆస్తి, ప్రాణ నష్టాన్ని ఎలా నివారించాలి, అత్యవసర సమయాలలో ప్రాథమిక చికిత్స పద్ధతులు, సీ.పీ.ఆర్ చేసే విధానం, తదితర అంశాలపై ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆయా శాఖల ఆధ్వర్యంలో విజయవంతంగా మొదటి దఫా శిక్షణ పూర్తి చేయడం జరిగిందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్లు నేర్చుకున్న అంశాలను గుర్తుంచుకుని, విపత్తులు వాటిల్లిన సమయాల్లో సమర్ధవంతంగా సేవలు అందించాలని సూచించారు. కాగా, ఆపదమిత్ర వాలంటీర్ల శిక్షణ కార్యక్రమానికి సహకరించిన న్యాక్ అధికారులకు, శిక్షణ ఇచ్చిన సిబ్బందికి, ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టరేట్ సిబ్బందికి, తోడ్పాటును అందించిన అధికారులకు జిల్లా యంత్రాంగం తరపున అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ విపత్తుల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలు అరెస్టు





**తాడ్వాయి ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి** తాడ్వాయి మండలం సంగోజీ వాడి గ్రామంలో దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 17 ,18 తారీకులలో సంగోజీవాడి గ్రామంలో రాత్రిపూట గడ్డం రాజవ్వ, గంట రాజశేఖర్, గడ్డం సత్యవ్వ, ఇండ్లలో తాళాలు పగలగొట్టి బంగారం మరియు వెండి ఆభరణాలు, డబ్బులను చోరీ చేసిన వ్యక్తులను (1)దోమకొండ అనిల్, (2)గడ్డం బాలరాజు అనే ఇద్దరు నిందితులను నిన్న రాత్రి 9 గంటలకు అరెస్టు చేసినట్టు ఎస్సై తెలిపారు. వారి వద్ద నుండి ఏడు గ్రాముల బంగారం 10 తులాల వెండి ఒక సౌండ్ బాక్స్ 300 రూపాయలను స్వాధీనపరచుకొని వారిని జ్యుడిషియల్ రిమాండ్ కు పంపామని తెలిపారు.

# తప్పుడు ఫిర్యాదుతో ప్రైవేట్ అధ్యాపకుల టీచర్ ఎమ్మెల్సీ ఓట్ల తొలగింపు

### తుది జాబితాలో ఉన్నవారి ఓట్లను యధావిధిగా ఉంచాలి

### తెలంగాణ లెక్చరర్ల ఫోరం అధ్యక్షులు డాక్టర్ బాలు



**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 22.** మెదక్ ,నిజామాబాద్, ఆదిలా బాద్, కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ ఓట్ల తుది జాబితాలో ఉన్న ప్రైవేటు కళాశాలల అధ్యాపకులు ఉపాధ్యాయుల పేర్లను తప్పుడు ఫిర్యాదుతో తొలగించడం జరిగిందని తెలంగాణ లెక్చరర్ల ఫోరం అధ్యక్షులు డాక్టర్ బాలు విలేకరుల సమావేశంలో తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయ సంఘం తప్పుడు ఫిర్యాదును కరీంనగర్ ఎలక్ట్రోలర్ అధికారికి ఉద్దేశపూర్వకంగానే ఫిర్యాదు చేయడం జరిగిందని దీనివలన 350 మంది గా తుది జాబితాలో ఉన్న టీచర్ ఎమ్మెల్సీ ఓటు కలిగిన ఉపాధ్యాయులు,అధ్యాపకులు అమూల్యమైన ఓటు హక్కును కోల్పోవడం జరిగిందని అన్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 200 మందికి పైగా అధ్యాపకులు ఉపాధ్యాయులు ఓటు హక్కును కోల్పోయారని,తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై విచారణ చేపట్టాలని,ఓటు కలిగిన వారికి కనీసమైన సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించడం సరికాదని దీనిపైన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని అన్నారు.




## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసిల్దార్, ఎస్సై

ప్రజా జ్యోతి ప్రతినిధి: ఫిబ్రవరి,22, కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పట్ల మద్నూర్ మండల కేంద్రంలో నిర్వహించే పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు మండల తాసిల్దార్ ఎండి ము-ంజీబ్ ఎస్ఐ విజయ్ కొండ తెలిపారు. వారి ఇరువురు కలిసి శనివారం నాడు మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తాసిల్దార్ మరియు ఎస్సై తెలిపారు.

## ఈ నెల 24న ప్రజావాణి కార్యక్రమం రద్దు

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 22.** ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న వచ్చే సోమవారం (24-2-2025) నాటి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శాసన మండల ఎన్నికల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందనీ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ప్రజల విజ్ఞాపనలు తీసుకోవడానికి కలెక్టరేట్ లోని రూం నెంబర్ 25 లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సమస్యల దరఖాస్తులు హెల్ప్ డెస్క్ లో అందజేయవచ్చని తెలిపారు.

### అత్తారింటికి వచ్చిన అల్లుడు

# అనుమానాస్పద స్థితిలో మృతి




**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 22.** అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం కామారెడ్డి సెగ్మెంట్ బిక్కనూరులో జరిగింది. శనివారం బంధువుల కథనం ప్రకారం మెదక్ జిల్లా గంగాపురానికి చెందిన శ్రీనివాస్ శుభకార్యం నిమిత్తం తన అత్తగారింటికి వచ్చాడు. శుక్రవారం అతిగా మద్యం సేవించి రాత్రి ఆరు బయట పడుకోవడంతో తెల్లవారుజామున భార్య సరిత వచ్చి నిద్ర లేపిన లేవలేదు. చుట్టు ప్రక్కల వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు.



# నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

**ప్రజా జ్యోతి జుక్కల్ ఆర్సీ ఫిబ్రవరి 22** ఉమ్మడి గురుకులాల ప్రవేశనికి 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు నేడు పరీక్ష నిర్వహించినట్లు పెద్ద కొడపగల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత శనివారం ఒక ప్రకటనలు తెలిపారు. పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. విద్యార్థుల హాల్ టికెట్ పై తక్కడిపల్లి అని ఉంటుందానీ, విద్యార్థులు ఆందోళన చెందవద్దు అన్నారు. పెద్ద కొడపగల్ సాంఘిక సంక్షేమ బాలిక గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రం ఉంటుంది అని తెలిపారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్నులను తీసుకొని రావాలని సూచించారు. హాల్ టికెట్లలో ఏమైనా తప్పిదాలు ఉన్నట్లయితే విద్యార్థులు చదువుతున్న పాఠశాల నుండి బోనఫైడ్ సర్టిఫికెట్ లేదా ఆధార్ కార్డులను పరీక్ష కేంద్రానికి తీసుకొని వచ్చి ఇన్విజిలేటర్లకి చూపించాలని పేర్కొన్నారు.



# కాట్టేపల్లిలో అఖండ హరినామ సప్తా ప్రారంభం

**ప్రజా జ్యోతి జుక్కల్ ఆర్సీ ఫిబ్రవరి 22** పెద్ద కొడప్గల్ మండలంలోని కాటేపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం ఆవరణలో శనివారం అఖండ హరినామ సప్తహ కార్యక్రమం ప్రారంభించారు. అధ్యక్షులు విఠల్ మహారాజ్ మాట్లాడుతూ ... గత 17 సంవత్సరాలుగా కాటేపల్లి గ్రామంలో సప్తహ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు ప్రారంభమైన సప్తహ కార్యక్రమం వచ్చే నెల 1వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

# బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్: పి డి వామన్ రావు

**(ప్రజా జ్యోతి) ఆర్ సి బీర్కూర్ ఫిబ్రవరి 22** బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయంలో , పి డి వామన్ రావు సోషల్ ఆడిట్ నిర్వహించారు. 2023,2024 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులలో 2కొట్ల వరకు పనులు జరిగాయని అందులో భైరాపూర్ గ్రామపంచాయతీలో చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని ఏపీఓ అక్మల్ తెలిపారు. అక్కడున్న ఎఫ్ ఏ ను సస్పెండ్ చేశారని, తరువాత టెక్నికల్ అసిస్టెంట్ పర్యవేక్షణలో పనులు జరిగాయని ఎక్కడకూడ ఎలాంటి పొరపాట్లు జరగలేదని, పీడీ హర్షం వ్యక్తం చేశారాన్నారు. పిడిని వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ , టెక్నికల్ అసిస్టెంట్ మస్టర్లలో కొలతలను బట్టి బిల్స్ చేసేటప్పుడు 4 వేల రూపాయలు తప్పులు జరిగినట్లు చెప్పారు,కొన్ని పత్రికలలో వచ్చినటువంటి వార్తలు, అవాస్తవమని అన్నారు.

# రంప పితూరీ ధీరుడు ద్వారబందాల చంద్రయ్య దొర!

**మొదటి పేజీ తరువాయి...**

గోలుకొండ ప్రాంతా లకు విస్తరించింది.



## వారి ఆగడాలు చూడలేక....!

1880 సెప్టెంబర్ 10న లక్ష్మయ్య దొర, నరసమ్మలకు బొబ్బిలిలో జన్మించిన చంద్రయ్య దొర తూర్పుగోదావరి జిల్లా శంఖవరం మండలం నెల్లిపూడిలో తన మేనమామల ఆధీనంలో పెరిగాడు. తుపాకీ కాల్చడం, విలువిద్య, కర్రసాము, గుర్రపుస్వారీలందు మంచి ప్రవీణుడు. తన కంటే గురికాడు ఎవరైనా ఉన్నారని తెలిస్తే సాధన చేసి అతనిని ఓడించే వరకు నిద్రపోయేవాడు కాదు. మంచి పట్టుదల కలవాడు. నెల్లిపూడి ప్రాంతంలో వారి మేనమామలు 'రవణం' వారు పెత్తందార్లుగా ఉండేవారు. పన్నులు వసూలు చేయు అధికారం, తీర్పు చెప్పే అధికారం కలిగి, పిఠాపురం జమీందారులకు జవాబుదారీగా ఉండేవారు. ఆయనకు యుక్త వయస్సు వచ్చే నాటికి వానలు లేక పంటలు పండక కరువు పరిస్థితులు ఏర్పడినవి. కలరా, మశూచి, ప్లేగు, విషజ్వరాలు ప్రబలి వైద్యం లేక చాలా మంది మరణించారు. ఆ ప్రాంతములో తుఫాను సంభవించడంతో మరింత కరువు ఏర్పడింది. ఇంతటి కరువు పరిస్థితులలోనూ సంస్థానాధీశులు ప్రజలకు పన్నులు వేసి, పుల్లరి పేరుతో పశువులకు పన్నులు విధించి పీడించ సాగారు. పన్ను కట్టనివారి ఆస్తులు, పశువులను, వ్యవసాయ పనిముట్లను వేలం వేసేవారు. ఇలాంటి అవమానాలకు గురైనవారు గ్రామాలను విడిచి వెళ్లేవారు. మరికొందరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో మన్యం ప్రాంత గూడేలన్నీ వలసలతో నిండిపోయాయి. మహిళల మాన ప్రాణాలకు విలువ లేకుండా పోయింది. బ్రిటిష్ పాలకుల తొత్తులుగా మారిన సంస్థానాధీశులు, జమీందారులు విలాసవంత జీవితానికి అలవాటు పడ్డారు. మహిళలపై, పేదవారిపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. తెల్ల దొరలు వీరి మాటలు నమ్మేవారు తప్ప ప్రజల యోగ క్షేమాలను స్వయంగా చూసేవారు కాదు. ఇది చూసిన చంద్రయ్య దొర ఉండలేకపోయాడు. అసలే పౌరుష వంతుడు. వారిపై తిరగబడ్డాడు. మన్యం అటవీ ప్రాంతంలో సాగు చేసుకుంటున్న రైతులు అక్కడి బ్రిటిష్ అధికారులు ముఠాదారులు, భూస్వాములు, జమీందారులు దౌర్జన్యంగా వారి పంటలు దోచుకునేవారు. దీంతో వారిపై 1879లో చంద్రయ్య తిరుగుబాటు లేవనెత్తాడు. ఈ తిరుగుబాటునే బ్రిటిష్ అధికారులు 'రంప పితూరీ' గా పిలిచారు.

## పదవికి సైతం ఆశపడక చంద్రయ్యదొర...!

ఆజానుబావుడు. ఉంగరాల జుట్టు, తల వెనుక జులపాలు కలిగి, ఠీవిగా చింతపిక్క రంగు గుర్రంపై సంచారం చేస్తూ ఆంగ్లేయులకు, సామాన్య ప్రజలను హింసించేవారికి, వడ్డీ వ్యాపారస్తులకు సింహస్వప్నంగా ఉండేవాడు. మన్యం ప్రజల పక్షాన నిలబడి బ్రిటిషువారిపై తిరుగుబాటు చేసేవాడు. చింతాకుల అక్కయ్య ఇంటి వద్ద పెద్దిపాలెం మీద జరిగినది ఆయన తొలి తిరుగుబాటు. కరువు రోజులలో ప్రజలకు అతడు గంజి సత్రాలు స్థాపించాడు. చంద్రయ్య తిరుగుబాటును సద్దుమ-ణిగించడానికి కలెక్టర్ ఆయనకు ముఠా పదవి ఇవ్వడానికి ప్రతిపాదించగా అందుకు ఒప్పుకోలేదు. సంస్థానాధీశ పదవిని ఆశ చూపినా, భార్య సీతమ్మ ఒత్తిడి చేసినా చంద్రయ్య ససేమిరా అన్నాడు. పదవిని తిరస్కరించడంతో బ్రిటిషు వారు ఆయనను ఎలాగైనా బంధించి చంపాలనుకొని అతని బురద కోట స్థావరాన్ని ముట్టడించి కాల్పులు జరపగా, గాయాలతో చంద్రయ్య రహస్యంగా శరభవరం పారిపోయాడు. దాడి తర్వాత ఆయన 1881, ఏప్రిల్లో అడ్డతీగల పోలీస్ స్టేషన్ ను ధ్వంసం చేశాడు. దానికి ప్రతీకారంగా ప్రభుత్వం చంద్రయ్య అనుచరులను 79 మందిని కాల్చి వేసింది. కారం తమ్మన్న దొరను కిరాతకంగా చంపి రాజమండ్రి పరిసరాలలో పడేసినట్లు అక్కడి స్థానికులు చెబుతున్నారు. ఆయన ఆంగ్ల ప్రభుత్వాన్ని కూలదోస్తాడని బెంగ పట్టుకుంది. దీంతో నిఘా పెంచి ఆయనను సజీవంగా, లేక నిర్జీవంగా పట్టిచ్చిన వారికి వేయి రూపాయలు బహుమతి ప్రకటించింది ప్రభుత్వం. దీంతో చంద్రయ్య మారు వేషంలో తిరుగుతూ ఉండేవాడు. అడవిదారిలో ధాన్యం, పప్పుదినుసులు బండ్లను అడ్డగించి, వాటిని పేద ప్రజలకు పంపిణీ చేసేవాడు. బంధువులు సహకారంతో చంద్రయ్య దొరను బంధించి చంపేయాలని కలెక్టర్, పిఠాపురం, కాట్రావులపల్లి, కోలంక, కిర్లంపూడి జమీందారులు ఒక పథకం వేశారు. కిర్లంపూడిలో ఏనుగులు వెంకటస్వామి ఇంట్లో మత్తు మందు కలిపిన భోజనం తినిపించి స్పృహ కోల్పోయేలా చేశారు. అనంతరం బ్రిటిష్ సైనికులు అతడి చేతులకు, కాళ్లకు బేడీలు వేసి కిర్లంపూడి ఏనుగుల వీధి, రామకోవెల దక్షిణ దిశగా ఉన్న రావి చెట్టుకు వేలాడదీసి ప్రజలందరి సమక్షంలో తుపాకులతో 1891, ఫిబ్రవరి 23న కాల్చివేశారు.



# ఆరోగ్యం పోషణపై మహిళా సంఘ సభ్యులకు శిక్షణ





**నాగిరెడ్డిపేట్, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి):** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందని ఐకేపీ ఏపీఎం జగదీష్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులతో పాటు ఆరోగ్య కార్యకర్తలకు, గ్రామ సంఘ సహాయకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉండాలని దానికి సంబంధించి సూచనలు, సలహాలను పలు జాగ్రత్తలను గురించి ఆయన అంశాల వారీగా మహిళా సంఘ సభ్యులకు వివరించారు. ఆరోగ్యం పోషణ కు సంబంధించి మెలకువలను సవివరంగా అంశాల వారీగా ఆయన మహిళా సంఘ సభ్యులకు తెలియజేశారు. ఆకుకూరలు, కూరగాయలు, మాంసం , గుడ్ల తో పాటు వివిధ పోషక విలువ గల ఆహారం ఏ విధంగా తీసుకోవాలో, అనారోగ్యం బారిన పడకుండా తీసుకోవాల్సిన తగు జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు శాంత మరియు పాలకవర్గం పాటు సీసీలు దత్తు, రమేష్ , నారాయణ, సాయిలు, రషీద్, సుజాత, అకౌంటెంట్ రాజు ఆపరేటర్ రవితో పాటు పలు గ్రామ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలు

# దేశ ఔన్నత్యాన్ని చాటించాలి





**ఎల్లారెడ్డి ఫిబ్రవరి -22( ప్రజా జ్యోతి )** సాంస్కృతి సాంప్రదాయాలు దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పాలని ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకాంత్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలోవిద్యార్థులకు నృత్య పోటీలు కార్యక్రమం నిర్వహించారు. ఈపోటీల్లో విద్యార్థినియులు సోలో, గ్రూపు డాన్స్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే నృత్యాలతో విద్యార్థులు అలరించారు. కళలు అంతరించి పోకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాంస్కృతి సంప్రదాయాలు, కళలు దేశ ఔన్నత్యాన్ని చాటుతాయని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలకు చదువులతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పాలన్నారు. భరతనాట్యం, కూచిపూడి, జానపదం, మణిపురి, ఒడిస్సీ, కథక్, పేరిణి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రకాంత్, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ వి. శంకరయ్య, సభ్యుడు కమిటీ చంద్రకాంత్, టి ఎస్ కే సి ఇంచార్జి జె.శివకుమార్, అధ్యాపకులు డాక్టర్ నాగానిక, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ గంగారెడ్డి, డాక్టర్ సిద్దురాజు, కృష్ణ ప్రసాద్, డాక్టర్ గోదావరి, శశిధర్, రాణి, సంతోష్, మోయిన్, సంగీత, దశరథ్, మహమూద్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







## త్రాగునీటి కొరకు నూతన పైప్ లైన్ ఏర్పాటు

**నాగిరెడ్డిపేట్,ఫిబ్రవరి22(ప్రజాజ్యోతి):** నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో శనివారం త్రాగు నీటి కొరకు నూతన పైపు లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ రాజ్ కుమార్ తెలిపారు.వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలనీలో త్రాగు నీటి సమస్య రాకుండా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 2 లక్షల రూపాయల ఎస్డీఎఫ్ నిధులతో నూతన త్రాగునీటి పైపు లైన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు .అలాగే ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో బాన్సువాడ వాసి మృతి

**(ప్రజా జ్యోతి) ఆర్ సి, ఫిబ్రవరి 22 బాన్సువాడ.** హైదరాబాద్ ఉప్పల్ వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ప్రమాదంలో బాన్సువాడ వాసి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాత బాన్సువాడకు చెందిన నక్క సందీప్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం తహసిల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో వాహనం అదుపు తప్పి కింద పడిపోవడంతో తలకు గాయలై మృతి చెందాడు. ఈ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## తిమ్మయ్య గారి సుశీల నారాయణరెడ్డి

# ఉన్నత పాఠశాలలో ప్రజ్ఞోత్సవం





### హాజీరైన జిల్లా విద్యాశాఖ అధికారి

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి (బిబిపేట్) ఫిబ్రవరి 22.** తిమ్మయ్య గారి సుశీల నారాయణరెడ్డి ఉన్నత పాఠశాల బాలురు బిబిపేటలో శనివారం బిబిపేట కాంప్లెక్స్ పరిధిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూల రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో కృత్యమేల, ప్రజ్ఞోత్సవం నిర్వహించడం జరిగింది. పాఠశాల సముదాయంలోని 19 పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ స్పెల్ బి రీడింగ్ కాంపిటీషన్స్ క్విజ్ మొదలైన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు వివిధ అంశాలకు సంబంధించిన కృత్యాలను ప్రదర్శించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రాజు బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ మండలంలోని పాఠశాలలన్నీ నృత్యమేళాలు చాలా చక్కగా చేశారని ఈ కృత్యాలన్నిటిని పాఠశాలల్లోని విద్యార్థులకు నిర్వహించి పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు 100 శాతం ఉత్తీర్ణులు రావడానికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీ వేణుగోపాల్ శర్మ, డిస్ట్రిక్ట్ సైన్సు ఆఫీసర్ సిద్ధిరామిరెడ్డి, మండల విద్యాధికారి అశోక్, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.